క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మునగపాక: చూచుకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఆ శాఖ ఈఈ రామకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా గణపర్తి, చూచుకొండ, నరేంద్రపురం, కుమారపురం, ఆనందపురం గ్రామాల్లో గృహ, వ్యవసాయ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న కనకరామ్ దంపతులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామ పరిధిలో తలపెట్టిన గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి దాతలు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇటీవల గుడి నిర్మాణానికి పెద్దలు భూమిపూజ చేశారు. దీనిలో భాగంగా రాపేటి సత్యనారాయణ, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం పెద్ద కుమారుడు వెంకట కనకరామ్–సత్య దంపతులు బుధవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



మునగపాక అభయాంజనేయ స్వామి ఆలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక సంతబయలు అభయాంజనేయ స్వామి ఆలయ 27వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో హరేరామ హరేకృష్ణ ఏకాహం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు అభయాంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకుడు మణికంఠ తగు చర్యలు తీసుకున్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి



తిమ్మాపురంలో కాలువ నిర్మిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు. తిమ్మాపురంలో ఓ వీధిలోని కాలువ శిథిలావస్థకు చేరడంతో యుద్ధ ప్రాతిపదికన రూ.50 వేలు కేటాయించి కాంక్రీట్ డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నట్టు చెప్పారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

అచ్యుతాపురం రూరల్ : శ్రీవిష్ణు హస్పిటల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి వైద్యుడు అడిగర్ల సుధీర్ తెలిపారు. అడిగర్ల అప్పలనాయుడు 21వ వర్ధంతి సందర్భంగా శ్రీవిష్ణు ఆస్పత్రి, సురక్షా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేయనున్నామన్నారు.

విశాఖ యోగాంధ్రకు వెయ్యి మంది విద్యార్థులు

కశింకోట: విశాఖలో ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమానికి మూడు మండలాల నుంచి వెయ్యి మంది విద్యార్థులను తరలించడానికి మండల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కశింకోట హైస్కూళ్ల నుంచి 525 మంది, మాకవరపాలెం నుంచి 340 మంది, రావికమతం నుంచి 126 మంది వంతున విద్యార్థులను ఇక్కడి నుంచి బస్సుల్లో తీసుకెళ్లనున్నారు. వాటికి బస్సు ఒక్కంటికి ఇద్దరు వంతున ఉపాధ్యాయులను ఇన్‌చార్జులుగా నియమించారు. ఇతర మండలాల విద్యార్థులను ఈ నెల 20న కశింకోటకు తీసుకువచ్చి వారికి స్థానిక బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, బాల సదనం, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో వసతి కల్పించి బస్సుల్లో ఈ నెల 21న తెల్లవారుజామున 3 గంటలకు విశాఖకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంఈవో సురేష్ కుమార్ తెలిపారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎం. వెంకటలక్ష్మి, ఎంఈవోలు కె.ఎస్.ఎన్. మూర్తి, సురేష్‌కుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

కన్ను పడితే కైవసమే.!

- కొత్తపాలెంలో గెడ్డ పోరంబోకు కబ్జా
- ప్రధాన రహదారి పక్కనే స్థలం చదును
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



కొత్తపాలెంలో చదును చేసిన గెడ్డ పోరంబోకు స్థలం

యలమంచిలి రూరల్: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అధికార పార్టీ నేతలకు ఇక పండగే. గెడ్డ పోరంబోకు స్థలమైనా వదలకుండా చదును చేసి ఆక్రమించేస్తున్నారు. తాజాగా యలమంచిలి మున్సిపాలిటీ కొత్తపాలెంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గెడ్డ పోరంబోకు స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో తెరవెనుక గ్రామానికి చెందిన కొందరు అధికారపార్టీ నాయకుల హస్తం ఉన్నట్టు ఆరోపణలున్నాయి.

యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నంబరు 251లో గెడ్డ పోరంబోకు ఉంది. గ్రామానికి ఆరంభంలో ఏటా వర్షా కాలంలో మాలగెడ్డలోంచి వరదనీరు ప్రవహిస్తుంది. మాలగెడ్డపై నిర్మించిన వంతెన పక్కనే సుమారు 10 సెంట్ల విలువైన గెడ్డ పోరంబోకు స్థలాన్ని కొందరు ఆక్రమణకు స్కెచ్ వేశారు. గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు దీనికి సహకారం అందించడంతో ఆ స్థలాన్ని యంత్రాలతో చదును చేసి, గ్రావెల్‌తో ఎత్తు చేస్తున్నారు. ఈ స్థలాన్ని ఎత్తు చేసుకునేందుకు ఉపయోగిస్తున్న గ్రావెల్ యలమంచిలి సమీపంలో ఉన్న పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి అక్రమంగా తరలించడం విశేషం. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి పీడబ్ల్యూడీ కాల్వ, గెడ్డ అని నమోదై ఉంది. ఆక్రమించుకోవడానికి చదును చేస్తున్న స్థలం విలువ సుమారుగా రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు ఉంటుందని అంచనా. అందరి కళ్ల ముందే దర్జాగా ఇదంతా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది సహకారం ఉందన్న ఆరోపణలు బలంగా ప్రచారంలో ఉన్నాయి. ఇదిలా ఉండగా గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమిస్తున్న వ్యవహారాన్ని కవర్ చేసేందుకు బుధవారం అక్కడకు కొందరు విలేకరులు వెళ్లారన్న సమాచారం తెలుసుకున్న స్థానిక వీఆర్వో సూర్యనారాయణ హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి ఆక్రమణదారులను హెచ్చరించడం విశేషం. ప్రధాన రహదారి పక్కనే ఆక్రమణ జరుగుతున్నా ఇంత వరకు తెలియలేదా? అని వీఆర్వోను ప్రశ్నించగా.. తడబడుతూ, ఇటీవల కొద్ది రోజులు తాను సెలవులో ఉన్నానని సమాధానమిచ్చారు.



ఆక్రమణదారులను హెచ్చరిస్తున్న వీఆర్వో సూర్యనారాయణ



ఆక్రమిత స్థలం పక్కనే మాలగెడ్డపై నిర్మించిన వంతెన

ఆక్రమణలతో ముంపు ప్రమాదం

వర్షాకాలంలో మాలగెడ్డలోంచి భారీగా వరదనీరు ప్రవహిస్తుంది. ఇప్పటికే గెడ్డ మొత్తం పూడికలతో నిండిపోయింది. తాజాగా గెడ్డ పక్కనే ఉన్న స్థలాలను కొందరు ఆక్రమించుకుంటున్నారు. దీంతో భారీ వర్షాలు కురిస్తే గెడ్డలో నీరంతా పక్కనున్న పంట పొలాలను, కొత్తపాలెం గ్రామాన్ని ముంచెత్తే ప్రమాదం ఉంది. కొత్తపాలెం గ్రామం భౌగోళికంగా పల్లపు ప్రాంతంలో ఉంది. గతంలో పలుమార్లు మాలగెడ్డ ఉగ్రరూపం దాల్చినపుడల్లా గ్రామమంతా ముంపునకు గురై, కొద్ది రోజులపాటు బాహ్య ప్రపంచంతో రాకపోకలు తెగిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి ఆక్రమణల కారణంగా మాలగెడ్డపై నిర్మించిన వంతెన కూడా దెబ్బతినే అవకాశం ఉంది. ఇటీవల మాలగెడ్డలో పూడిక తీయించాలని రైతులు, కొందరు గ్రామస్తులు జలవనరుల శాఖ అధికారులకు వినతిపత్రం ద్వారా విన్నవించారు. ఈ నేపథ్యంలో ఏకంగా మాలగెడ్డపై ఉన్న వంతెనకు ఆనుకుని ఉన్న విలువైన గెడ్డ స్థలాన్ని ఆక్రమించుకోవడంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమణదారులను హెచ్చరించాం..

కొత్తపాలెం గ్రామానికి ఆనుకుని మాలగెడ్డ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. దీనికి సంబంధించి ఆక్రణదారులను పిలిచి భూకబ్జా చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాల్సిందిగా కింది స్థాయి సిబ్బందిని ఇప్పటికే ఆదేశించాం. ఆక్రమణలు జరగకుండా నిఘా పెడతాం.

– కె.వరహాలు, తహసీల్దార్, యలమంచిలి

‘ఏఐఎస్‌ఎఫ్ నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికం’

యలమంచిలి రూరల్: అక్రమంగా పుస్తకాల విక్రయాన్ని వ్యతిరేకిస్తూ విజయవాడ శ్రీచైతన్య కాలేజీ ఎదుట శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అడ్డుకోవాల్సిన ప్రభుత్వం, పోలీసులు దానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులపై జులుం ప్రదర్శించడం దురదృష్టకరమన్నారు. కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ వైఖరి మారకపోతే భవిష్యత్తులో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పౌష్టికాహారం తీసుకోవడం శ్రేయస్కరం



మాట్లాడుతున్న పబ్లిక్ హెల్త్ నర్స్ అనురాధ

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ పబ్లిక్ హెల్త్ నర్స్ అనురాధ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. బాలింతలు, గర్భిణులు తాజాగా ఉన్న పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం దేవకి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ సూర్యచంద్రరావును సత్కరిస్తున్న ప్రసాద్, తదితరులు

మునగపాక: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం గ్రామపెద్దలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైస్కూల్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ హైస్కూల్ అభివృద్ధిలో భాగంగా వంటశాల ఏర్పాటుకు రూ.2లక్షలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ సహకారంతో పైప్‌లైన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పూర్వ విద్యార్థి పెంటకోట గిరిబాబు మాట్లాడుతూ తనవంతుగా మెగా ఫోన్, మైక్ సెట్ సమకూరుస్తానన్నారు. అనంతరం ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించేందుకు కృషి చేసిన హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ సూర్యచంద్రరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట వెంకట్, టెక్కలి పరశురామ్, ఆడారి కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి రమణబాబు, సూరిశెట్టి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మెరుగైన దిగుబడులు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: వరిలో విత్తన శుద్ధి ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. వరి విత్తనాలతో సుడోమాన్స్ ఫ్లోరిసెస్ మందును కలిపి పిచికారీ చేయడం మంచిదన్నారు. విత్తనశుద్ధి చేపట్టడం ద్వారా తెగుళ్ల బెడద ఉండదన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మునగపాక, చూచుకొండ పీఏసీఎస్‌ల పరిధిలో 90 టన్నుల యూరియా కూడా రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం ఏవో విజేత, వీఏఏ శ్వేత, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంచాయతీల్లో సంపద సృష్టించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్ : పంచాయతీల్లో సంపద సృష్టించి ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ భూముల్లో, చెరువు గట్లపై మొక్కలు నాటి సంపద సృష్టించాలన్నారు. అంతకు ముందు ఎంఈవో దేవరాయల్ మాట్లాడుతూ తల్లికి వందనం ఆంక్షలపై వివరణ ఇచ్చారు. సమావేశంలో దిబ్బపాలెం సర్పంచ్ శాంతి కుమారి మాట్లాడుతూ తన కుమార్తె ఎనిమిదో తరగతి చదువుతున్నా తాను సర్పంచ్ అయినందున తల్లికి వందనం పడలేదన్నారు. దీనిపై అధికారులు అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రభాకర్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా డేను విజయవంతం చేయాలి



యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు



గొట్టివాడ ఎంపీపీ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



మునగపాకలో యోగా సాధన చేస్తున్న దృశ్యం

మునగపాక: ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా వేడుకలను విజయవంతం చేయాలని డీఈవో అప్పారావు నాయుడు కోరారు. బుధవారం మండలంలో పలు హైస్కూళ్లను సందర్శించిన ఆయన సంబంధిత ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులను ఈ వేడుకలకు తీసుకువెళ్లి తిరుగు ప్రయాణంలో సురక్షితంగా తీసుకోవాలన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కోటవురట్ల: గొట్టివాడ ఎంపీపీ స్కూల్‌లో యోగా సంసిద్ధతా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా యోగా చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా విద్యార్థులను సంసిద్ధం చేస్తూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు హెచ్‌ఎం జీవన్ తెలిపారు. మూడు రోజుల పాటు విద్యార్థులతో యోగా సాధన చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మునగపాక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి పరశురామ్, సూరిశెట్టి అప్పలనాయుడు, కాశీ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో గోపూజ



శతకంపట్టు కనకదుర్గ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



కనకదుర్గ ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హోమం, గోపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి, పొలమరశెట్టి యుగంధర్, జ్యోతి, పొలిమేర అచ్చినాయుడు, జగదీశ్వరి, పొలమరశెట్టి శివప్రసాద్, సాయి లక్ష్మి, కోయిలాడ శివ, మౌనిక దంపతులతో ప్రధాన అర్చకులు బోగారపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్ పూజలు చేయించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ గురువారం అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


స్కీం వర్కర్లకు పథకాలు వర్తింపజేయాలి

కె.కోటపాడు : ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు కోరారు. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించలేని పక్షంలో, తక్షణం వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఒక కుటుంబం బతకడానికి నెలకు రూ.26వేలు ఉండాలని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనే ఆదేశాలను కోర్టు ఇచ్చిందని అన్నారు. అయితే స్కీం వర్కర్లకు ఇంత జీతాలను ఎక్కడా ఇవ్వడం లేదని ఆరోపించారు.

వైభవంగా సాంబశివుని వార్షిక కల్యాణోత్సవం



శివ, పార్వతుల కల్యాణోత్సవం



కల్యాణ శివపార్వతుల కల్యాణ ఉత్సవ విగ్రహాలు

కశింకోట: స్థానిక కస్పావీధిలో సాంబశివుని వార్షిక కల్యాణోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి ఆలయ ప్రాంగణంలో కల్యాణాన్ని నిర్వహించారు.శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ విఘ్నేశ్వరుని పూజ, విశ్వక్షేన పూజ, యజ్ఞోపవీతం ధారణ, కన్యాదానం, శుభ ముహూర్తాన జీలకర్ర, బెల్లం పెట్టుట, మాంగళ్యధారణ, తలంబ్రాలు వేయడం, కంకణ ధారణ, కర్పూర దండల అలంకరణ వంటి అంశాలతో సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకుడు వేయిదశంల ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కల్యాణం పురస్కరించుకొని ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై దర్శించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్నసీఐ మల్లికార్జునరావు

పరవాడ: మండలంలో గొర్లివానిపాలెం బీసీ కాలనీకి చెందిన గొర్లి దేవి మెడలో పుస్తెల తాడు లాక్కెళ్లిన కేసులో పరవాడ పోలీసులు ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు బుధవారం మీడియాతో మాట్లాడుతూ, తెలిపిన వివరాలు..

గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి దేవి మార్చి 12న బీసీ కాలనీ వీధిలో నడిచి వెళ్తుండగా వెనుక నుంచి స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న 5 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. దేవి ఫిర్యాదు మేరకు పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి బుధవారం కూర్మన్నపాలెం కూడలిలో దొంగతనానికి పాల్పడిన బొండా అరుణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. దొంగిలించిన పుస్తెలతాడును ఓ గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టినట్లు గుర్తించామన్నారు. పుస్తెలతాడుతోపాటు, చోరీకి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరుణ్‌కుమార్‌పై గతంలో ఆనందపురం, సబ్బవరం, ఉయ్యూరు టౌన్ పోలీస్ స్టేషన్లలో మూడు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో మోటారు సైకిల్ దొంగతనం కేసు నమోదయ్యాయి. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో షీట్ ఓపెన్ చేశారని చెప్పారు. మహిళలు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మల్లికార్జునరావు సూచించారు. సమావేశంలో ఏఎస్‌ఐ బి.వై.నాయుడు, హెడ్ కానిస్టేబుల్ సాయిసంతోష్, క్రైం కానిస్టేబుల్ జీఎస్‌ఎస్‌వీ నాయుడు పాల్గొన్నారు.

‘108 వాహన సిబ్బందికి జీతాలు చెల్లించాలి’

అనకాపల్లి: చాలీచాలని జీతాలతో అత్యవసర వైద్య సేవలందిస్తున్న 108 వాహన సిబ్బందికి పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. జిల్లాలో 108 వాహన ఉద్యోగులు 114 మంది విధుల నిర్వహిస్తున్నారని, వీరికి మూడు మాసాలుగా జీతాలు చెల్లించలేదన్నారు. ఇప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని 108 వాహన సిబ్బందికి జీతాలు తక్షణమే చెల్లించాలని కోరారు.

పెచ్చులూడిన ఎన్టీఆర్ ఆస్పత్రి శ్లాబ్



ల్యాబ్ రూమ్‌లో పెచ్చులూడిన శ్లాబ్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగుల పరీక్షలు చేసే ల్యాబ్‌లో శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి పడిపోవడంతో ల్యాబ్ టెక్నీషియన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి ఉన్నత స్థాయి వైద్యాధికారులకు తెలియజేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. నూతనంగా నియమించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన చేస్తున్న వ్యవసాయాధికారులు

అనకాపల్లి టౌన్: ప్రతీ రైతు నారుమడులు సిద్ధం చేసుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి రంగాచారి సూచించారు. మండలంలోని వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి గ్రామాల్లో పీఎండీఎస్ విత్తనాలు విత్తడం, ఖరీఫ్ ముందస్తు పనులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లి పెసర, జనుము, జీలుగా వంటి పచ్చిరొట్ట సేంద్రియ విత్తనాలు వేసుకోవాలన్నారు. నాలుగు సెంట్లకు గాను 30 కేజీల వరి విత్తనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.